
సాక్షి
పశ్చిమగోదావరి
మంగళవారం | 8 | ఏప్రిల్ | 2025



ముగిసిన 'వసంత' ఉత్సవాలు

ద్వారకాతిరుమల: క్షేత్ర దేవత కుంకుళ్లమ్మ ఆలయంలో వసంత నవరాత్రి ఉత్సవాలు సోమవారంతో ముగిశాయి. మహిళలు **సామూహిక కుంకుమ పూజలు చేశారు.**



సంచార పశు వైద్యానికి గ్రహణం

సంచార పశు వైద్యశాలలకు గ్రహణం పట్టింది. ఏలూరు జిల్లాలోని ఏడు వాహనాలు నెల రోజులుగా నిలిచిపోయాయి.

8లో ▸



ఎటు చూసినా మట్టి మాఫియానే

ద్వారకాతిరుమల మండలం కోడిగూడెం పంచాయతీకి చెందిన బొటుకు కుంట చెరువులో అక్రమ మట్టి తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి.

8లో ▸

న్యూస్‌రీల్

ఆత్మీయ సమావేశానికి తరలిరండి

వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు **డీఎన్నార్**



కైకలూరు: వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా ఆత్మీయ సమావేశానికి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) సోమవారం కోరారు. ఏలూరు మినీ బైపాస్‌రోడ్ క్రాంతి కల్యాణ మండపంలో మంగళవారం ఉదయం 9 గంటలకు ఆత్మీయ సమావేశం ప్రారంభమవుతుందన్నారు. కైకలూరు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు ఉదయం 7 గంటలకు కైకలూరు మండలం ఆటపాక ఐస్ ఫ్యాక్టరీ వద్దకు రావాలని కోరారు. పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చిస్తామన్నారు. కార్యక్రమానికి రాష్ట్ర నాయకులు, జిల్లాలో నియోజకవర్గ ఇన్‌చార్జిలు, ముఖ్య నాయకులు హాజరవుతారని డీఎన్నార్ తెలిపారు.

న్యాయమూర్తుల బదిలీ

ఏలూరు (టూటౌన్): రాష్ట్రవ్యాప్తంగా పలువురు జిల్లా జడ్జీలను బదిలీ చేస్తూ హైకోర్టు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఏలూరు పోక్సో కోర్టు జడ్జి ఎస్.ఉమా సునందను రాజమహేంద్రవరం పోక్సో కోర్టుకు బదిలీ చేశారు. ఆమె స్థానంలో విశాఖలో అడిషనల్ ఫ్యామిలీ కోర్టు జడ్జిగా పనిచేస్తున్న కె.వాణిశ్రీని నియమించారు. ఏలూరులో రెండో అడిషనల్ జిల్లా జడ్జి పి.మంగాకుమారిని విశాఖ పోక్సో కోర్టుకు జడ్జిగా బదిలీ చేశారు. ఆమె స్థానంలో విజయవాడలో 14వ అడిషనల్ జిల్లా జడ్జి పనిచేస్తున్న యు.ఇందిరా ప్రియదర్శిని నియమించారు. ఏలూరు 5వ ఏడీజే కోర్టు జిల్లా జడ్జి జి.రాజేశ్వరిని విజయవాడలోని మహిళా కోర్టు జడ్జి బదిలీ చేశారు. ఆమె స్థానంలో కర్నూలు జిల్లా ఆళ్లగడ్డ 5వ అదనపు జిల్లా జడ్జిగా పనిచేస్తున్న ఆర్‌వీవీఎస్ మురళీకృష్ణను నియమించారు. నరసాపురంలో 9వ అడిషనల్ జిల్లా జడ్జి పి.విజయదుర్గను ఒకటో అడిషనల్ స్పెషల్ జడ్జి ఫర్ సీబీఐ కేసెస్ (విశాఖ)కు బదిలీ చేశారు. ఏలూరు జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి, ఫస్ట్ అడిషనల్ జిల్లా అండ్ సెషన్స్ జడ్జి ఎం.సునీల్‌కుమార్‌ను విజయవాడ 12వ అడిషనల్ జిల్లా అండ్ సెషన్స్ జడ్జిగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో అక్కడ పనిచేస్తున్న పి.భాస్కరరావును నియమించారు. ఇప్పటివరకు ఖాళీగా ఉన్న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి పోస్టులో విజయవాడ ఎంపీస్, ఎమ్మెల్యేస్ కోర్టులో స్పెషల్ జడ్జిగా పనిచేస్తున్న ఎస్.శ్రీదేవిని నియమించారు.


చట్టపరిధిలో కేసుల విచారణ



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ నయీం అస్మి

భీమవరం: ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో ఫిర్యాదుదారుల విషయంలో సానుకూలంగా స్పందించి సమస్యలను చట్టపరిధిలో తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ఆదేశించారు. సోమవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఆయన ప్రజల నుంచి 18 అర్జీలు స్వీకరించారు. అర్జీల్లో కుటుంబ కలహాలు, సైబర్ మోసాలు, వేధింపులు, నకిలీ పత్రాలు వంటివి ఉన్నాయి. ఆయా సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. ఫిర్యాదులను పరిశీలించి వాటి పూర్వాపరాలను విచారణ చేసి చట్టపరిధిలో తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లా అదనపు ఎస్పీ వి.భీమారావు, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వి.పుల్లారావు, డీసీఆర్‌బీఇన్‌స్పెక్టర్ దేశింశెట్టి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఏలూరు సర్కిల్ ఏఓగా శ్రీదేవి



ఏలూరు ఎస్ఈ సాల్మన్ రాజుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఏఓ ఫైనాన్స్ శ్రీదేవి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఈపీడీసీఎల్ ఏలూరు ఆపరేషన్ సర్కిల్ అకౌంట్స్ అధికారి (ఫైనాన్స్)గా టి.శ్రీదేవి నియమితులయ్యారు. ఆమె ప్రస్తుతం జంగారెడ్డిగూడెం విద్యుత్ రెవెన్యూ కార్యాలయంలో అకౌంట్స్ అధికారిగా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ప్రస్తుతం ఏలూరులో పనిచేస్తున్న రాజశేఖర్‌ను కాకినాడ సర్కిల్‌కు బదిలీ చేశారు. శ్రీదేవి సోమవారం ఎస్ఈ పి.సాల్మన్ రాజును మర్యాదపూర్వకంగా కలిశారు.

అందని ఆరోగ్యశ్రీ

ప్రజారోగ్యం బలి

- నిలిచిన ఆరోగ్యశ్రీ సేవలు
- పాత బకాయిల విడుదల చేయని కూటమి ప్రభుత్వం
- నమ్మెలోకి నెట్‌వర్క్ ఆస్పత్రులు
- జిల్లాలోని 19 హాస్పిటల్స్‌లో సేవలు బంద్
- ఖాళీగా ఆరోగ్యశ్రీ హెల్ప్‌డెస్క్‌లు
- ఉచిత వైద్యం అందక రోగుల ఇక్కట్లు



భీమవరంలోని శ్రీలక్ష్మి హాస్పిటల్‌లో ఖాళీగా ఉన్న ఆరోగ్యశ్రీ హెల్ప్‌డెస్క్

సాక్షి, భీమవరం: పేద, మధ్యతరగతి వర్గాలకు అపర సంజీవనిలా ఉన్న ఆరోగ్యశ్రీకి కూటమి ప్రభుత్వం తూట్లు పొడుస్తోంది. పాత బకాయిలు విడుదల చేయకపోగా, సమస్యను చక్కదిద్దే ప్రయత్నం చేయకపోవడంతో నెట్‌వర్క్ ఆస్పత్రులు సమ్మెబాట పట్టాయి. జిల్లాలోని 30 నెట్‌వర్క్ ఆస్పత్రులకు గాను 19 ఆస్పత్రులు సేవలను నిలుపుచేశాయి. దీంతో వైద్యసేవల కోసం రోగులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

బకాయిలపై నిర్లక్ష్యం

జిల్లాలోని 30 వరకు ప్రైవేట్ ఆస్పత్రులు ఆరోగ్యశ్రీ (ఎన్‌టీఆర్ వైద్యసేవ) సేవలు అందిస్తున్నాయి. రోజుకు సుమారు 1,500 వరకు ఓపీ నమోదవుతుండగా ఇన్ పేషెంట్లుగా చేరేవారు 500 వరకు ఉంటున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలుచేసింది. క్యాన్సర్ లాంటి ఖరీదైన జబ్బుల చికిత్సకు పరిమితి లేకుండా సాయం అందించింది. 1,059 చికిత్సల సంఖ్య (ప్రొసీజర్ల)ను 3,257కి పెంచడంతో పాటు కుటుంబానికి రూ.5 లక్షల ఉన్న వ్యయ పరిమితిని రూ.25 లక్షలకు పెంచడం ద్వారా పేదల ఆరోగ్యానికి మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరింత భరోసా కల్పించారు. కాగా కూటమి ప్రభుత్వం ఆరోగ్యశ్రీకి ఎసరుపెడుతోంది. ఆస్పత్రులకు బకాయిల విడుదలకు తీవ్ర జాప్యం చేస్తోంది.

సేవలు బంద్ : జిల్లాలోని నెట్‌వర్క్ ఆస్పత్రులకు ప్రభుత్వం రూ.150 కోట్ల మేర బకాయిలు చెల్లించాల్సి ఉంది. వీటిలో ఒక్కో ఆస్పత్రికి రూ.2 కోట్ల నుంచి రూ.10 కోట్ల వరకు బకాయిలు ఉన్నట్టు యాజమాన్యాలు చెబుతున్నాయి. వీటిని విడుదల చేయాలని నెల రోజుల క్రితం ఏపీ స్పెషాలిటీ హాస్పిటల్ అసోసియేషన్ (ఆశా) ప్రభుత్వానికి నోటీస్ ఇచ్చింది. ప్రభుత్వం స్పందించకపోవడంతో ముందుగా ప్రకటించినట్టుగానే జిల్లాలోని భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం, పాలకొల్లు, నరసాపురంలోని 19 ఆస్పత్రుల్లో సేవలను నిలుపుచేశారు. తణుకులోని మొత్తం ఆరు నెట్‌వర్క్ ఆస్పత్రులు సేవలను బంద్ చేయగా భీమవరంలో నాలుగు, తాడేపల్లిగూడెంలో ఐదు, నరసాపురంలో రెండు, పాలకొల్లులో రెండు ఆస్పత్రులు బంద్ చేశాయి. ఆయా ఆస్పత్రుల్లో రోగులకు అవసరమైన సహకారం అందించే ఆరోగ్యశ్రీ హెల్ప్ డెస్క్‌లలోని ఆరోగ్యమిత్రలు లేకుండా కనిపించాయి.

పేదలకు ఇక్కట్లు

ఆరోగ్యశ్రీపై ఉచిత వైద్యసేవలు పొందేందుకు వచ్చిన రోగులను ఆసుపత్రి సిబ్బంది సొమ్ములు చెల్లించిన వారికే వైద్యం అందుతుందని చెప్పడంతో పేద వర్గాల వారు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. తప్పనిసరి పరిస్థితుల్లో కొందరు నగదు చెల్లించి వైద్యసాయం పొందగా, చెల్లించే స్థోమత లేక మరికొందరు ఉసూరుమంటూ వెనుతిరిగారు. జిల్లాలో మిగిలిన 11 ఆస్పత్రులు కూడా సేవలు నిలుపుదల చేయనున్నట్టు తెలుస్తోంది. అధికారంలోకి వచ్చాక వైద్యసేవల్ని నిర్వీర్యం చేస్తూ వస్తున్న కూటమి ప్రభుత్వం తమకు ఆరోగ్య భరోసానిస్తున్న ఆరోగ్యశ్రీని మొత్తం ఆపేయాలని చూస్తోందని పేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బకాయిలు విడుదల చేయడం ద్వారా సేవల పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వైద్యం కోసం వెళితే డబ్బులు కట్టాలన్నారు



భీమవరంలోని కంటి ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ ద్వారా గతంలో కంటి ఆపరేషన్ చేయించుకున్నాను. రెండో కంటికి ఇబ్బంది ఉండటంతో మళ్లీ ఆరోగ్యశ్రీలో వైద్యం కోసం ఆస్పత్రికి వచ్చాను. ఆరోగ్యశ్రీ ఓపీ చూడటం లేదని, డబ్బులు చెల్లించి వైద్యం చేయించుకోవాలని చెప్పారు. నగదు చెల్లించే స్థోమత లేక వైద్యం చేయించుకోలేక పోయాను.

–దమ్ము మంగతాయారు, భీమవరం

ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేసిన నెట్‌వర్క్ ఆస్పత్రులు

ఆస్పత్రి	పట్టణం
యాపిల్ హాస్పిటల్	తణుకు
అవినాష్ ఆర్థో ట్రామా అండ్ క్రిటికల్ కేర్	భీమవరం
జానకీ హాస్పిటల్	నరసాపురం
గీతా హాస్పిటల్	తణుకు
జ్ఞానానంద ఆప్తాల్మిక్ ఇనిస్టిట్యూట్	భీమవరం
మదర్ వన్నిని హాస్పిటల్	తాడేపల్లిగూడెం
ప్రణవి నర్సింగ్ హోమ్	తాడేపల్లిగూడెం
రాజర్షి హాస్పిటల్స్	భీమవరం
సాయిశ్వేత సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్	తణుకు
శేషాద్రి హాస్పిటల్	పాలకొల్లు
శ్రీలక్ష్మి హాస్పిటల్స్	భీమవరం
శ్రీ స్టార్ హాస్పటల్ ఎమర్జెన్సీ అండ్ క్రిటికల్ కేర్	తాడేపల్లిగూడెం
శ్రీ సూర్య హాస్పిటల్	నరసాపురం
శ్రీ సూర్య నర్సింగ్ హోమ్	పాలకొల్లు
శ్రీసాయి హాస్పిటల్	తణుకు
సుధ హాస్పిటల్	తణుకు
సూర్యతేజ ఆర్థోపెడిక్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్	తణుకు
ట్రినిటీ హాస్పిటల్స్	తాడేపల్లిగూడెం
యూనియన్ హాస్పిటల్స్	తాడేపల్లిగూడెం

పరిష్కార వేదికలో 279 అర్జీల స్వీకరణ



కలెక్టరేట్‌లో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో 279 అర్జీలను స్వీకరించారు. అర్జీలకు నిర్ణీత గడువులోపు పరిష్కారం చూపాలని కలెక్టర్ సీహెచ్ నాగరాణి అధికారులను ఆదేశించారు. సోమవారం భీమవరం కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ అర్జీలు స్వీకరించారు. అనంతరం అధికారులతో సమావేశమయ్యారు. ఫిర్యాదులను గడువులోపు పరిష్కరించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి వాస్తవాలను తెలుసుకోవాలన్నారు. జిల్లాలో రెడ్‌క్రాస్ సభ్యత్వాలను పెంచేందుకు అధికారులు కృషిచేయాలన్నారు. కొన్ని మండలాల్లో సభ్యత్వాల నమోదు ప్రారంభం కాలేదన్నారు. షెడ్యూల్ మేరకు ఉద్యోగుల నుంచి రక్త సేకరణ కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. డీఆర్వో మొగిలి వెంకటేశ్వర్లు, కేఆర్‌ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణ రెడ్డి, డ్వామా పీడీ కేసీహెచ్ అప్పారావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అర్జీల్లో కొన్ని..

- ల్యాండ్ కన్వర్షన్ ఆన్‌లైన్ కోసం పలుమార్లు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని నరసాపురం మండలం యర్రంశెట్టివారిపాలెంకు చెందిన కూనపురెడ్డి వీర వెంకట విజయ రంగారావు అర్జీ అందజేశారు.
- పంచాయతీ చెరువును వేలంలో పాడుకుని చేపలు పట్టుకుని పాట సొమ్మును పంచాయతీకి జమ చేయలేదని, సొమ్ము జమయ్యేలా చూడాలని భీమవరం మండలం కొత్త పూసలమర్రుకు చెందిన కొల్లాటి ధర్మరాజు అర్జీ సమర్పించారు.

ఫిషర్‌మెన్ సొసైటీ ఎన్నికలపై హైకోర్టు స్టే

పెనుగొండ: మండలంలోని దొంగరావిపాలెంలోని శ్రీ కోదండరామా బోట్స్‌మెన్ ఫీల్డ్ లేబర్, ఫిషర్‌మెన్ కో–ఆపరేటివ్ సొసైటీ ఎన్నికలపై రాష్ట్ర హైకోర్టు స్టే విధించింది. ఈనెల 9న ఎన్నికలు జరగాల్సి ఉండగా తమ ఓట్లు అన్యాయంగా తొలగించారంటూ ఎనిమిది మంది సొసైటీ సభ్యులు హైకోర్టును ఆశ్రయించారు. సొసైటీ ఎన్నికల్లో భాగంగా ఫిషరీస్ శాఖ అధికారులు ఓటర్ల జాబితా ప్రకటించారు. దీనిలో 14 మంది సభ్యుల ఓట్లను తొలగించారు. దీంతో సభ్యులు తమ ఓట్ల తొలగింపుపై అభ్యంతరాలు వ్యక్తం చేశారు. అయినా అధికారులు ససేమిరా అనడంతో వీరిలో 8 మంది సభ్యులు మాజీ అధ్యక్షుడు లంకే వీర్రాజు ఆధ్వర్యంలో కోర్టును ఆశ్రయించారు. హైకోర్టు వీరి వాదనలు విన్న తర్వాత తదుపరి ఉత్తర్వులు జారీ చేసే వరకు ఎన్నికలు నిర్వహించవద్దంటూ సోమవారం మధ్యంతర ఉత్తర్వులను జారీ చేసింది. ఈ మేరకు ఆయా శాఖల అధికారులు సమాచారం అందింది.

అన్యాయంగా ఓట్లు తొలగించారు

ఎన్నికల్లో ఓటమి భయంతో ఓట్లు తొలగించారని సొసైటీ మాజీ అధ్యక్షుడు లంకే వీర్రాజు ఆరోపించారు. సమావేశాలకు హాజరు కావడం లేదంటూ తప్పుడు సమాచారం ఇచ్చి తమ ఓట్లు తొలగించారన్నారు. హైకోర్టుకు వాస్తవాలు విన్నవించడంతో ఎన్నికలు నిలుపుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని చెప్పారు.

ఆటోనగర్‌లో స్థలాల కోసం ధర్నా



ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఆటోమొబైల్ కార్మికులు

ఏలూరు (టూటౌన్): తమకు ఏలూరు ఆటోనగర్‌లో స్థలాలు కేటాయించాలంటూ ఆటోమొబైల్ కార్మికులు గళమెత్తారు. ది ఏలూరు ఆల్ ట్రేడ్ ఆటోమొబైల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆటోనగర్‌లో స్థలాలు ఇవ్వాలని, ఏలూరులో షెడ్లు నిర్వహించుకుంటున్న వారిపై మున్సిపల్ అధికారుల వేధింపులు ఆపాలంటూ సోమవారం ఫైర్ స్టేషన్ సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేశారు. ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆటోనగర్ ఏర్పాటు సమయంలో మాగంటి నాగభూషణం చేసిన అవకతవకల వల్ల స్థలాలు పొందని సుమారు 200 మంది కార్మికులు నగరంలో అద్దె స్థలాల్లో సొంత షెడ్లు నిర్వహించుకుంటున్నారన్నారు. మున్సిపల్ అధికారులు 10 రోజులుగా ఆయా షెడ్లపై ఆంక్షలు విధిస్తూ ఆటోనగర్‌కు వెళ్లాలంటూ నోటీసు బోర్డులు ఏర్పాటుచేయడం హేయమన్నారు. వారిపై వేధింపులు తగదన్నారు. యూనియన్ కన్వీనర్ ఉప్పులూరి హేమ శంకర్ మాట్లాడుతూ ఆటోనగర్‌లో స్థలాలు కేటాయిస్తే తక్షణమే షెడ్లను తరలిస్తామన్నారు. కార్మికులు బొండాడ హరి నారాయణమూర్తి, కొప్పిశెట్టి వెంకటపతి, కాటూరి శ్రీధర్, గ్రంధి నాగ రవి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

కాగుపాడు సర్పంచ్ సస్పెన్షన్

ఉంగుటూరు: ఉంగుటూరు మండలం సర్పంచ్ కడియాల సుదీప్తను పదవి నుంచి మూడు నెలల పాటు సస్పెండ్ చేస్తూ కలెక్టర్ వెట్రిసెల్వి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. పంచాయతీలో జరిగిన ఆర్థిక అవకతవకల ఆరోపణలపై చర్యలు తీసుకున్నట్టు తెలిసింది.

మన్యంలో వడగళ్ల వాన

బుట్టాయగూడెం: మండుతున్న ఎండలు ఓ వైపు.. అకాల వర్షాలు మరోవైపు మన్యం ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. రెండు రోజులుగా పశ్చిమ ఏజెన్సీలోని ఏదొక ప్రాంతంలో భారీ వర్షాలు పడటంతో పాటు ఈదురుగాలులు వీస్తున్నాయి. సోమవారం మధ్యాహ్నం వడగళ్ల వాన బీభత్సం సృష్టించింది. 3 గంటల సమయంలో వాతావరణం ఒక్కసారిగా మేఘావృతమై వడగళ్ల వానతో పాటు తీవ్రమైన గాలి దుమారం లేపింది. దీంతో బుట్టాయగూడెంలోని పలుచోట్ల చెట్లు నేలకొరిగాయి. చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలపై పడటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. సుమారు 3 గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ స్తంభాల పునరుద్ధరణ పనులను అధికారులు చేపట్టారు. మండలంలోని గుబ్బల మంగమ్మగుడి, కామవరం, మోతుగూడెం, తానిగూడెం, కోర్సవారిగూడెం, అలివేరు తదితర గ్రామాల్లో వడగళ్ల వాన కురిసింది. పీఆర్‌గూడెం తదితర ప్రాంతాల్లో భారీ వర్షంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. తన చేలో ఆరబెట్టిన మొక్కజొన్న పంట దెబ్బతిందని రైతు తెల్లం పెంటయ్య ఆవేదన వ్యక్తం చేశారు.

చాట్రాయిలో గాలి వాన

చాట్రాయి: చాట్రాయి మండలంలో సాయంత్రం 4 గంటలకు గాలివాన బీభత్సం సృష్టించింది. ఓ పక్క ఎండ, మరోపక్క వాన కురిసింది. కల్లాలపై ఉన్న మొక్కజొన్న తడిసిపోయింది.

జంగారెడ్డిగూడెం మండలంలో..

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం మండలంలో సోమవారం ఈదురుగాలులు, వడగళ్ల వాన కురిసింది. జంగారెడ్డిగూడెం సుబ్బంపేటలో 5, చక్రదేవరపల్లిలో 2 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. పలు ప్రాంతాల్లో విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. విద్యుత్ డీఈ యు.సుబ్బారావు ఆధ్వర్యంలో విద్యుత్ సిబ్బంది విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపట్టారు. ఈదురుగాలులకు కొబ్బరిచెట్లు, తాటిచెట్లు కూలడంతో పాటు పంటలు నేలవాలాయి.

ముసునూరు మండలంలో..

ముసునూరు: మండలంలో సాయంత్రం గంటసేపు ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. మండలంలో 20 విద్యుత్ స్తంభాలు నేలకొరగగా రూ.3 లక్షలకు పైగా నష్టం వాటిల్లింది. ముసునూరు, కాట్రేనిపాడు, గోపవరం, చింతలవల్లి, గోగులంపాడు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అక్కిరెడ్డిగూడెంలో అరటి పంట నేలవాలాగా రమణక్కపేట, లోపూడి, సూరేపల్లిల్లో మామిడి తోటల్లో కాయలు నేల రాలాయి. ఎస్సై ఎం.చిరంజీవి ఆధ్వర్యంలో సహాయక చర్యలు చేపట్టి రవాణాకు ఇబ్బందులు లేకుండా చేశారు. విద్యుత్ ఏఈ వీరబాబు ఆధ్వర్యంలో విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపట్టారు.



ముసునూరు: కాట్రేనిపాడు గ్రామంలో రోడ్డుపై కూలిన చెట్టు



బుట్టాయగూడెం: మండలంలోని పులిరామన్నగూడెంలో భారీ వర్షం



బుట్టాయగూడెం: బూసరాజుపల్లిలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తున్న సిబ్బంది



బుట్టాయగూడెం: దొరమామిడిలో నేలకొరిగిన చెట్లు



జంగారెడ్డిగూడెం: సుబ్బంపేటలో కూలిన స్తంభం

'ఓపెన్' ప్రాక్టికల్స్ ప్రారంభం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్) ఆధ్వర్యంలో దూర విద్యా విధానంలో నిర్వహిస్తున్న ఇంటర్మీడియెట్ కోర్సుల ప్రాక్టికల్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. భౌతికశాస్త్రం పరీక్షకు 40 మందికి 29 మంది హాజరయ్యారు. రసాయన శాస్త్రం పరీక్షకు 40 మందికి 32 మంది హాజరయ్యారు. జీవశాస్త్రం పరీక్షకు 40 మందికి 28 మంది హాజరయ్యారు. జిల్లాలో మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని డీఈఓ ఎం.వెంకట లక్ష్మమ్మ తెలిపారు.

జేఈఈ మెయిన్స్‌కు 188 మంది హాజరు

భీమవరం: భీమవరం డీఎన్నార్ కళాశాలలో జేఈఈ మెయిన్స్ పరీక్షలకు 200 మందికి 188 మంది హాజరయ్యారు. కేంద్రం పర్యవేక్షకుడు బి.సూర్యనారాయణమూర్తి పర్యవేక్షించారు.

ఏలూరులో 233 మంది..

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరంలోని సిద్ధార్థ క్వెస్ట్ కేంద్రంలో సోమవారం నిర్వహించిన జేఈఈ మెయిన్స్ సెషన్–2 పరీక్షలకు 233 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షలను సిటీ కో– ఆర్డినేటర్ పి.సాయి కుమారి శంకర్ పర్యవేక్షించారు.

బాలికతో ఆర్‌ఎంపీ అసభ్య ప్రవర్తన

ఏలూరు టౌన్: ఏలూరులో బాలికపై ఆర్‌ఎంపీ వైద్యుడు అసభ్యంగా ప్రవర్తించడంతో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరులో ఎ.రత్నప్రసాద్ (56) అనే ఆర్‌ఎంపీ వైద్యుడు తన ఇంటి సమీపంలో సోమవారం సాయంత్రం ఆడుకుంటున్న ఓ బాలికకు మాయమాటలు చెప్పి ఇంట్లోకి తీసుకువెళ్లి తలుపులు వేశాడు. బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ ఉండగా స్థానికులు గమనించి కేకలు వేశారు. అనంతరం ఏలూరు రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. విచారణ చేసి పోక్సో కేసు నమోదు చేస్తామని పోలీసులు చెబుతున్నారు. రత్నప్రసాద్ భార్యాపిల్లలు అతడి నుంచి దూరంగా ఉండటంతో ఒంటరిగా జీవిస్తున్నాడు. గతంలో 12 ఏళ్ల బాలికపై అఘాయిత్యానికి పాల్పడేందుకు ప్రయత్నించాడని, వైద్యం కోసం వచ్చే మహిళలతోనూ అసభ్యంగా ప్రవర్తిస్తాడంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు.

చిన్నారిపై వీధి కుక్క దాడి



గాయపడిన చిన్నారి ఐశ్వర్య

నూజివీడు: మండలంలోని బత్తులవారిగూడెంలో ఐదేళ్ల చిన్నారిపై వీధి కుక్క దాడి చేసి గాయపర్చింది. గ్రామానికి చెందిన కోలవంటి మధు కుమార్తె ఐశ్వర్య సోమవారం సాయంత్రం 6 గంటల సమయంలో ఇంటిలో నుంచి బయటకు రాగా వీధి కుక్క మీదకు వచ్చింది. దీంతో పాప భయపడి కింద పడిపోగా ఆమె కంటి వద్ద, తలపై కరిచింది. బాలిక అరుపులు విని తల్లిదండ్రులు, చుట్టుపక్కల వారు వచ్చి కుక్కను తోలేశారు. వెంటనే ఐశ్వర్యను నూజివీడు ఏరియా ఆస్పత్రికి తరలించి వైద్యం అందించారు. గ్రామంలో కుక్కల సంచారం ఎక్కువైందని చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

క్లుప్తంగా

చెస్ పోటీల్లో ప్రథమస్థానం



విజేతగా నిలిచిన సాయిఅయాన్

ఏలూరు రూరల్: ఏలూరుకు చెందిన కనకం పోష్మవ్ సాయి అయాన్ రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపిక య్యాడని చెస్ అసోసియేషన్ కన్వీనర్ వాసుదేవరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5న ఏలూరు శ్రీసరస్వతి విద్యా నిలయంలో అండర్–7 ఏలూరు జిల్లా స్థాయి చెస్ పోటీలు జరిగాయని తెలిపారు. ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ పోటీల్లో సాయిఅయాన్ ప్రథమ బహుమతి సాధించాడని పేర్కొన్నారు.

యూత్ బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక



ఏలూరు రూరల్: ఈ నెల 9 నుంచి 16 వరకూ పాండిచ్చేరిలో 40వ జాతీయ స్థాయి అండర్–16 యూత్ బాస్కెట్‌బాల్ పోటీలు జరగనున్నాయని ఏలూరు జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కోశాధికారి కె.మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టుకు ఏలూరుకు చెందిన ఏ రుత్విక, ఎం.సోమశేఖర్ ఎంపికయ్యారని వివరించారు. వీరు ఫిబ్రవరి 8 నుంచి 11 వరకూ పిఠాపురంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చూపారన్నారు.

చోరీ కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: టి.నరసాపురం మండలం బొర్రంపాలెంలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఎం.రామిరెడ్డి ఈ నెల 4న హైదరాబాద్ వెళ్లి 7న ఉదయం ఇంటికి వచ్చాడు. ఇంటి తాళం పగులగొట్టి ఉండటంతో లోపలికి వెళ్లి చూడగా బీరువాలో మంగళసూత్రాలు, చెవిదిద్దులు, నల్లపూసలు చోరీకి గురైనట్లు గుర్తించాడు. సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సంచార పశు వైద్యశాలలకు గ్రహణం

- నెలరోజులుగా నిలిచిపోయిన ఏడు వాహనాలు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సేవలు అమోఘం



పశుసంచార వాహనం

దెందులూరు: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ప్రభుత్వ హయాంలో పశువులకు ఇంటి వద్ద మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సంచార పశు వైద్య సేవలు ప్రవేశపెట్టారు. వాహనంలో, డాక్టర్ హెల్త్ అసిస్టెంట్, డ్రైవర్ ఉంటారు. పశువులకు సంబంధించిన అన్ని మందులు ఉంటాయి. ఒక్కో నియోజకవర్గానికి రెండు సంచార వైద్య సేవల వాహనాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ సేవల కోసం 1962 టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేశారు. అనతికాలంలోనే రాష్ట్రవ్యాప్తంగా ప్రతి రైతు ముంగిట ఈ సేవలు గుర్తింపు పొందాయి.

ఫోన్ చేస్తే 20 నిమిషాల్లోపు వాహనం రావడంతో మెరుగైన వైద్య సేవలు సాధ్యమయ్యేవి. ఒక వాహనానికి ఏడాదిలో 720 కాల్స్ వచ్చేవి. 14 వాహనాలకు దాదాపు 10 వేలకు పైగా కాల్స్ అందేవి. గత నాలుగు సంవత్సరాలలో 14 వాహనాలకు సంబంధించి 56,480 కాల్స్ ద్వారా ఐదు లక్షలకు పైగా పశువులకు వైద్య సేవలు అందించారు. గత నెల నుంచి జిల్లాలో ఉన్న 14 సంచార పశువైద్యశాలలకు సంబంధించి 7 వాహనాలు నిలిచిపోయాయి. 7 వాహనాలు మాత్రమే సేవలందిస్తున్నాయి.

దీంతో సకాలంలో పశువులకు వైద్యం అందక రైతులు ఆందోళన చెందుతున్నారు. నిలిచిపోయిన ఏడు వాహనాలను వెంటనే ప్రారంభించి వైద్య సేవలు అందించేలా చూడాలని రైతులకు కోరుతున్నారు.

ఏలూరు జిల్లాలో పశువుల వివరాలు	
గేదెలు	5,06,610
ఆవులు	1,35,607
గొర్రెలు	5,26 836
మేకలు	1,98,810
కోళ్లు	1,02,78,022

వాహనాలను పునరుద్ధరించాలి



నోరులేని మూగజీవాల పట్ల కూటమి ప్రభుత్వ ప్రజాప్రతినిధులు కనికరం చూపాలి. నిలిచిపోయిన ఏడు సంచార పశు వైద్య వాహనాలను తిరిగి పునరుద్ధరించాలి. పూర్తిస్థాయిలో అనారోగ్యం ఉన్న ప్రతి పశువుకు ఇంటి ముంగిటకు వైద్య సేవలు అందేలా చూడాలి. నెల రోజుల్లోగా జరగకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడతాం.

– కట్టా ఏసుబాబు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి

కాంట్రాక్ట్ ముగిసిపోవడం వల్లే



ఫస్ట్ పేజ్‌లో మంజూరు చేసిన ఏడు సంచార వైద్య వాహనాల ఏజెన్సీ కాంట్రాక్ట్ ముగిసింది. త్వరలోనే ప్రభుత్వం తిరిగి మరో ఏజెన్సీకి కాంట్రాక్ట్ ఇస్తుంది.

– గోవిందరాజు, జాయింట్ డైరెక్టర్ పశుసంవర్ధక శాఖ, ఏలూరు

వివాహిత ఆత్మహత్య



మృతురాలు తనుశ్రీ

ముదినేపల్లి రూరల్: భర్త వేధింపులు తాళలేక వివాహిత ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని వడాలిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన బెజవాడ అనిల్ అదే గ్రామానికి చెందిన తనుశ్రీని ప్రేమిస్తున్నానంటూ వెంట తిరిగి రెండేళ్ల క్రితం పెళ్లి చేసుకున్నాడు. తనుశ్రీ మైనర్ కావడంతో తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు గతంలో కేసు నమోదు చేసి అనిల్‌ను రిమాండ్‌కు పంపారు. తనుశ్రీ మైనార్టీ తీరాక గతేదాది అక్టోబరులో వివాహం చేసుకుని అద్దె ఇంట్లో ఉంటున్నారు. ఇటీవల కట్నం తీసుకురమ్మని, తనపై నమోదైన కేసులో రాజీ చేసుకోవాలని వేధిస్తున్నాడు. తల్లిదండ్రులకు విషయాన్ని తెలియజేసి సోమవారం ఉదయం మనస్తాపంతో తనుశ్రీ ఉరేసుకుని చనిపోయినట్లు తెలిపారు. ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్ సంఘటనాస్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ఎటు చూసినా మట్టి మాఫియానే

కోడిగూడెం చెరువులో యథేచ్ఛగా అక్రమ మట్టి తవ్వకాలు



కోడిగూడెంలోని బొటుకుకుంట చెరువులో మట్టి అక్రమ తవ్వకాలు



ట్రాక్టర్ ద్వారా తరలిపోతున్న మట్టి

ద్వారకాతిరుమల: ఏ గ్రామానికి ఆ గ్రామంలో కూటమి నేతలు మట్టి మాఫియాగా ఏర్పడ్డారు. ఎక్కడ మట్టి కనిపిస్తే అక్కడ గద్దల్లా వాలిపోతున్నారు. అందిన కాడికి తవ్వుకుని, అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. ఆ నేతలకు భయపడి అధికారులెవరూ ఆ వైపు కన్నెత్తి చూడటం లేదు. దాంతో ఈ అక్రమ మట్టి దందాకు అడ్డూ అదుపూ లేకుండా పోతోంది. ఈ క్రమంలోనే సోమవారం ద్వారకాతిరుమల మండలం కోడిగూడెం గ్రామం పంచాయతీకి చెందిన బొటుకు కుంట చెరువులో అక్రమ మట్టి తవ్వకాలు యథేచ్ఛగా సాగాయి. కొందరు కూటమి నేతలు జేసీబీ సాయంతో ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలించారు. ఒక్కో ట్రక్కు మట్టిని రూ.500 నుంచి రూ.700కు విక్రయించగా వచ్చిన సొమ్ముతో జేబులు నింపుకున్నారు. కనీసం పంచాయితీ వారికి కూడా తెలియకుండా ఈ తవ్వకాలు జోరుగా జరుగుతున్నాయి.

మమ్మల్ని ఎవడ్రా ఆపేది..

పార్టీ కోసం కష్టపడ్డాం.. ఎంతో ఖర్చు చేశాం.. ఇప్పుడు మట్టి తవ్వుకోవద్దంటే ఊరుకుంటామా.. అని అంటున్నారు కొందరు కూటమి నేతలు. మా ప్రభుత్వం.. అంతా మా ఇష్టం, మమ్మల్ని ఎవడ్రా ఆపేది.. అంటున్నారు. ఆ ధైర్యంతోనే రాత్రి, పగలు తేడా లేకుండా మట్టి దందాను సాగిస్తున్నారు. ఇది చూస్తున్న ప్రజలు కూటమి నేతల తీరు పట్ల ముక్కున వేలేసుకుంటున్నారు. వారు దోచుకోవడానికి, దాచుకోవడానికా మేము ఓట్లు వేసి గెలిపించింది అని మండిపడుతున్నారు. ప్రజాధనాన్ని దోచుకుంటున్న నేతలపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

చోరీ కేసులో ఏడుగురి అరెస్టు



భీమవరంలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జయసూర్య

భీమవరం: ఆకివీడు పోలీసు సర్కిల్‌కు చెందిన కాళ్ల పోలీసుస్టేషన్ పరిధిలో దొంగతనాలకు పాల్పడుతున్న ఏడుగురిని సోమవారం ఏలూరుపాడులోని మురుగు కాలువ వద్ద అరెస్టు చేసినట్లు భీమవరం డీఎస్పీ ఆర్‌జీ జయసూర్య చెప్పారు. భీమవరంలో సోమవారం వివరాలు వెల్లడిస్తూ.. ఆకివీడు పట్టణానికి చెందిన వ్యాపారి కె.సుబ్బారావు మార్చి నెలలో కాళ్ల గ్రామంలోని షాపు నుంచి బైక్‌పై ఇంటికి వెళ్తూ.. కోనాలపల్లి వద్ద రోడ్డు పక్కన మూత్ర విసర్జనకు ఆగాడు. ఇంతలో బైక్‌కు తగిలించిన సంచిలోని రూ.2 లక్షలు దొంగిలించారు. దీంతో బాధితుడు ఫిర్యాదు మేరకు ఆకివీడు సీఐ వి.జగదీశ్వరరావు, కాళ్ల ఎస్సై ఎస్.శ్రీనివాసరావు ప్రత్యేక బృందంతో దర్యాప్తు చేపట్టారు. దొంగతనాలకు పాల్పడుతున్న ఏడుగురిని అరెస్టు చేయగా వారిలో ఇద్దరు మైనర్లు కావడం విశేషం. దుంపగడప పంచాయతీ పల్లెపాలెంకు చెందిన తిరుమాని కిషోర్, ఆకివీడుకు చెందిన బొట్టా మౌళి, కృష్ణంనాయుడు, దాసరి హరి, పెదపేటకు చెందిన ఎ.జాషువ, చెరుకువాడ పెదపేటకు చెందిన పాకలపాటి నరేష్ ఉన్నట్లు డీఎస్పీ చెప్పారు. నిందితుల నుంచి రూ.1.10 లక్షలు, రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

వృద్ధురాలిపై హత్యాచారం కేసులో జీవిత ఖైదు



పోలీసుల తరఫున వాదనలు వినిపించిన ఏపీపీని అభినందిస్తున్న ఎస్పీ

పాలకొల్లు సెంట్రల్/ఏలూరు (టూటౌన్): పాలకొల్లు పట్టణంలోని గతేడాది ఓ వృద్ధురాలిపై అత్యాచారం, హత్య కేసులో నేరం రుజువు కావడంతో ముద్దాయిలకు న్యాయమూర్తి జీవిత ఖైదు విధించినట్లు పట్టణ సీఐ కె.రజనీకుమార్ తెలిపారు. పట్టణంలోని బొండాడ వారి వీధిలో గత ఏడాది జులై 29న మధ్యాహ్నం సమయంలో బొక్కా రాజు, మీసాల మావుళ్లు చోరీ కోసం ఓ ఇంటికి వెళ్లారు. అక్కడ అనారోగ్యంతో మంచంపై ఉన్న వృద్ధురాలిపై అత్యాచారం చేసి తీవ్రంగా గాయపర్చారు. అలాగే బంగారం, సెల్‌ఫోన్, రూ.15 వేలు నగదు దోచుకున్నారు. వృద్ధురాలిని ఆసుపత్రికి తరలించగా నెల రోజులు మృత్యువుతో పోరాడి మృతి చెందింది. ఈ కేసులో ఏలూరు జిల్లా కోర్టులో వాదనలు పూర్తవగా అత్యాచారానికి పాల్పడినందుకు నిందితులకు జీవిత ఖైదుతో పాటు ఒక్కొక్కరికి రూ.5 వేలు జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో రెండేళ్లు సాధారణ జైలు శిక్ష విధించారు. హత్య చేసినందుకు జీవిత ఖైదుతో పాటు.. రూ.5 వేల జరిమానా విధించారు. నగదు చెల్లించకపోతే మరో రెండేళ్ల సాధారణ జైలు శిక్ష విధించారు. ఆమెను తీవ్రంగా గాయపర్చినందుకు ఇద్దరికీ చెరో పదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.2 వేలు జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో సంవత్సరం సాధారణ జైలు శిక్ష విధించారు. ఈ శిక్షలతో పాటు ఇద్దరికీ చెరో రూ.12 వేలు జరిమానా విధించారు. ఆ జరిమానా చెల్లించని పక్షంలో రెండేళ్లు సాధారణ జైలు శిక్ష అనుభవించాలి. అన్ని శిక్షలు ఏకకాలంలో అమలవుతాయని జడ్జి జి.రాజేశ్వరి తెలిపారు. దొంగిలించిన బంగారాన్ని దాచిన గుజ్జల రామకృష్ణకు ఐదేళ్ల జైలు శిక్షతో పాటు. రూ. 5 వేల జరిమానా వేశారు. నగదు చెల్లించలేకపోతే మరో ఏడాది సాధారణ జైలుశిక్ష విధించారు. ఏపీపీ రామాంజనేయులు పోలీసుల తరఫున వాదనలు వినిపించారు. కేసు దర్యాప్తు చేసిన సీఐ రజనీకుమార్, సీఐ మంగాదేవి, ఎస్సై పృథ్వీ, ఏఎస్సై శివాజి తదితరులను ఎస్పీ అభినందించారు.

ప్రేమ విఫలమై ఆత్మహత్య



రత్నకుమార్

పాలకొల్లు సెంట్రల్: ప్రేమ విఫలమై ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పాలకొల్లు పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం స్థానిక బ్రహ్మానందరెడ్డి కాలనీకి చెందిన బి.రత్నకుమార్ (17) రోజువారీ పనులకు వెళ్లేవాడు. తన కంటే వయస్సులో పెద్దయిన అమ్మాయిని గత కొంతకాలంగా ప్రేమిస్తున్నానంటూ వెంట తిరిగేవాడు. ఆ అమ్మాయి ప్రేమను తిరస్కరించడంతో మనస్తాపానికి గురైన కుమార్ ఆదివారం రాత్రి ఇంటిపై అంతస్తులో పడుకుంటానని వెళ్లి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం రత్నకుమార్ తల్లి గల్ఫ్‌లో ఉపాధి కోసం వెళ్లగా తండ్రి విజయవాడలో ఉద్యోగం చేస్తున్నాడు. పిన్ని వాళ్ల ఇంటి వద్ద ఉంటున్నాడు. మున్సిపల్ కార్మికులు ఎవరైనా సెలవు పెడితే వారి పేరున పనిలోకి వెళ్తుంటాడని తెలిపారు. ఆదివారం రాత్రి పడుకుంటానని చెప్పి ఇంటి పైఫ్లోర్‌కు వెళ్లి పడుకున్నాడు. ఉదయాన్నే ఎంతసేపటికి రావడంలేదు. దాంతో పైకి వెళ్లి చూడగా ఉరి వేసుకుని ఉండడాన్ని చూసి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై ప్రసాద్ కేసు నమోదు చేశారు.

క్రైస్తవ సంఘాల ర్యాలీ



ప్రవీణ్ మృతికి నిరసనగా క్రైస్తవ సంఘాల ర్యాలీ

పాలకొల్లు సెంట్రల్: పాస్టర్ ప్రవీణ్ కుమార్ అనుమానాస్పద మృతిని యాక్సిడెంట్‌గా చిత్రీకరించి ప్రచారం చేస్తున్న వారి కుట్రను వెలుగులోకి తీసుకురావాలని క్రైస్తవ సంఘాల పరిరక్షణ సమితి సభ్యులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో పూలపల్లి అంబేడ్కర్ విగ్రహం నుంచి తెలుగు క్రైస్తవ సంఘాల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో హలో క్రైస్తవా.. ఛలో పాలకొల్లు కార్యక్రమం నిర్వహించారు. సోషల్ మీడియా వేదికగా అసత్య ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. ఇదంతా ప్లాన్ ప్రకారమే చేస్తున్నారని అనుమానం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సనమండ ఎబినేజర్, సెంటిపాల్, ఖండవల్లి వాసు, రేణిబాబు, జి.శ్యాంసన్, ఇశ్రాయేలు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లపై తనిఖీ

పాలకొల్లు సెంట్రల్ : పట్టణంలో ప్లాస్టిక్ కవర్ల వాడకంపై స్పెషల్ డ్రైవ్ చేసినట్లు మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపారు. తనిఖీ చేసి 10 కేజీల ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. నాలుగు వ్యాపార సంస్థల్లో రూ.5 వేల వరకూ ఫైన్ వేసినట్లు తెలిపారు. నిషేధించిన ప్లాస్టిక్ కవర్లు వాడొద్దని, ఇక నుంచి రోజు తనిఖీలు చేస్తామని చెప్పారు. 120 మైక్రాన్ల కన్నా తక్కువ మందం ఉన్న కవర్లు వాడకూడదన్నారు. బయోడిగ్రేబుల్ కవర్లను మాత్రమే వాడాలని సూచించారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి



రైలు నుంచి పడి మృతి చెందిన సోమరాజు(45)

భీమడోలు: భీమడోలు రైల్వే స్టేషన్ సమీపంలో రైలు నుంచి జారిపడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం జరిగింది. రైల్వే పోలీసుల సమాచారం మేరకు.. రాజమండ్రికి చెందిన అమలపు సోమరాజు(45) సాయినగర్ షిర్డీ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్నాడు. రైలు భీమడోలు రైల్వే స్టేషన్ సమీపానికి వచ్చేసరికి సోమరాజు ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని రైల్వే పోలీసులు ఏలూరు సర్వజన ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అధిక దిగుబడి.. అయినా నిరాశే

- అధికారులు సిఫార్సు చేయని రకాలు సాగు చేసిన రైతులు
- తక్కువ ధరకు కమీషన్‌దారులకు విక్రయిస్తున్న వైనం



తాడేపల్లిగూడెం మండలం పడాల మార్కెట్ యార్డులో ఆరబెట్టిన ధాన్యం

తాడేపల్లిగూడెం రూరల్: అధిక దిగుబడులు పేరుతో ఆశ పడి సాగు చేస్తే చివరకు నిరాశే మిగిలింది. తాడేపల్లిగూడెం మండలంలో 25 వేల ఎకరాలకు పైగా వరి సాగు చేశారు. దాళ్వా సీజన్‌లో అధిక దిగుబడులకు ఆశపడి ఎస్ఎల్.10, పీఆర్.126 రకాన్ని సాగు చేశారు. ఈ రెండు రకాలు అధికారులు సిఫార్సు చేసినవి కావు. దాదాపు ఐదు వేల ఎకరాల వరకు ఈ రెండు రకాల వరి వంగడాలను రైతులు సాగు చేశారు. ప్రస్తుతం ఈ పంట చేతికొచ్చింది. దాదాపు 60 నుంచి 70 బస్తాల దిగుబడి వస్తోందని రైతులే చెబుతున్నారు. దిగుబడులు మాట ఇలా ఉంచితే ప్రభుత్వం ఈ రకాల వరి వంగడాలను కొనుగోలు చేయని పరిస్థితి. ఈ నేపథ్యంలో కమీషన్‌దారులు మాత్రమే ఈ ధాన్యాన్ని కొనుగోలు చేసి మిల్లులకు తరలిస్తున్నారు. ఎక్కువ శాతం ఈ రకం ధాన్యాన్ని ఆరబెట్టినా ముక్కయ్యే ప్రమాదం ఉందని పలువురు రైతులు పేర్కొంటున్నారు. ఈ క్రమంలో పచ్చిపైనే రైతులు విక్రయిస్తున్నారు. కమీషన్‌దారులు అయినకాడికి కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం మాత్రం ఎంటీయు 1121 రకం వరి వంగడానికి మద్దతు ధరను ప్రకటించింది. ప్రభుత్వ నిబంధనలకనుగుణంగా 17 శాతం లోపు తేమ ఉండాలి. ఈ రకం 75 కిలోల బస్తాకు రూ.1725గా ప్రభుత్వం ధర ప్రకటించింది. ఇదే నిబంధనలను పాటిస్తే ఎస్ఎల్–10, పీఆర్–126 రకాలు ఆరబెడితే 60 బస్తాలు కాస్తా 50 బస్తాలకు పడిపోయే అవకాశం ఉంది. ఆరబెడితే బస్తాల సంఖ్య తగ్గడంతో పాటు ఎక్కువగా ఆరబెడితే ధాన్యం ముక్క అయ్యే అవకాశం ఉంది. ఆ పరిస్థితే వస్తే మిల్లర్లు సైతం కొనుగోలు చేయని పరిస్థితి. దీంతో చేసేది లేక పచ్చిపైనే ధాన్యాన్ని విక్రయించి చేతులు దులుపుకుంటున్నారు.

నష్టపోతున్న రైతులు

నిబంధనలకు లోబడి ఉంటే ఎస్ఎల్–10, పీఆర్ 126 రకాలను కూడా కొనుగోలు చేస్తామని ప్రభుత్వం చెబుతోంది. ఇటీవల తాడేపల్లిగూడెం మండలం మోదుగగుంటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి ఈ రకాలు నిబంధనలకు లోబడి ఉంటే కొనుగోలు చేస్తామని ప్రకటించారు. పచ్చిపైన మిల్లర్లు 75 కిలోల బస్తా రూ.1360కు కొనుగోలు చేశారు. తదుపరి కొనుగోలు ప్రక్రియను రెండ్రోజులు నిలుపుదల చేసినట్లు తెలిసింది. ఎట్టకేలకు మళ్లీ ఎస్ఎల్–10, పీఆర్–126 రకాలను అదే ధరకు కొనుగోలు ప్రారంభించారు. సోమవారం రూ.1330కు కొనుగోలు చేసినట్లు రైతులు చెబుతున్నారు. ఆదివారం రూ.1340కు కొనుగోలు చేసినట్లు తెలిసింది. ఒక్క రోజు వ్యవధిలోనే రూ.10 తగ్గించి కొనుగోలు చేస్తున్నారు.

నిబంధనల మేరకు ఉంటే కొంటాం



రైతులు పండించిన ఎస్ఎల్–10, పీఆర్–126 రకాల్లో ప్రభుత్వ నిబంధనల మేరకు 17 శాతం లోపు తేమ ఉంటే కొనుగోలు చేస్తాం. ప్రభుత్వం నిర్ణయించిన ధరను రైతులను చెల్లిస్తాం. రైతులు ఆరబెట్టి ధాన్యాన్ని విక్రయించాలి.

– ఆర్ఎస్.ప్రసాద్, మండల వ్యవసాయాధికారి, తాడేపల్లిగూడెం

బెట్టింగ్‌లపై నిఘా

నూజివీడు: జిల్లాలో క్రికెట్ బెట్టింగ్ నిర్వహణ, బెట్టింగ్ యాప్‌లు, ఫోన్‌పేలో చేస్తున్న నగదు బదిలీలపై నిఘా పెడుతున్నట్లు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ తెలిపారు. నూజివీడు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం విలేకర్లతో మాట్లాడుతూ ఈనెల 11న ఆగిరిపల్లి ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన ఉన్నందున కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లను చేస్తున్నామన్నారు. బెట్టింగ్‌ల విషయంలో తల్లిదండ్రులు తమ పిల్లలను నిరంతరం గమనిస్తూ ఉండాలన్నారు. డబ్బులు పోగొట్టుకొని కొందరు ప్రాణాలు తీసుకుంటున్నారన్నారు. జిల్లాలో గంజాయి నివారణకు పటిష్ట చర్యలు తీసుకున్నామని, దీంతో గంజాయి రవాణా కేసులు సైతం తగ్గుముఖం పట్టాయన్నారు. ప్రతి కళాశాల, నగరాల్లో ఈగల్ క్లబ్‌లు ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షిస్తున్నామన్నారు. జిల్లాలో పోలీసు సిబ్బంది కొరత ఉందని, త్వరలోనే కొత్త సిబ్బందిని ప్రభుత్వం తీసుకోనున్నందున కొంత మేరకు సిబ్బంది కొరతను అధిగమించడానికి వీలవుతుందన్నారు. యువత పెద్ద పెద్ద శబ్దాలతో ప్రమాద భరితంగా బైక్‌రైడింగ్ చేస్తున్నారని, దీనిపై త్వరలోనే ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామన్నారు.

క్లుప్తంగా

తాళ్లపాలెంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం


తాళ్లపాలెం గ్రామంలో విగ్రహ ప్రతిష్ఠాపన చేసిన దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ఉప్పరగూడెం శివారు తాళ్లపాలెం గ్రామంలో బాల ఆంజనేయస్వామి, గణపతి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వార్ల లఘు విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవం సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తొమ్మిది మంది దంపతులు పీటలపై కూర్చొని హోమాలు జరిపారు. అనంతరం అన్నసమారాధన ఏర్పాటు చేయగా, స్థానికులతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

'స్వయం ఉపాధి సోపానం' ముఖాముఖీలు


ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న బ్యాంకు అధికారులు

అత్తిలి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో స్వయం ఉపాధి సోపానం పథకానికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు సోమవారం ఇంటర్వ్యూలు జరిగాయి. మండలంలో బల్లిపాడు, గుమ్మంపాడు, తిరుపతిపురం, వరిఘేడు, పాలి, మంచిలి, కంచుమర్రు, స్కిన్నెరపురం, పాలూరు, కొమ్మర, ఈడూరు గ్రామాలకు చెందిన అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి శామ్యూల్, ఎంపీపీ సుంకర నాగేశ్వరరావు, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలను త్వరగా పరిష్కరించాలి


సమస్యలు వింటున్న కమిషనర్ యేసుబాబు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు తెలిపారు. పురపాలక సంఘం పరిధిలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ప్రజలు 8 మంది ఆయా గ్రీవెన్స్ అందజేశారు. 2 ఇంజనీరింగ్ విభాగానికి, 3 రెవెన్యూ విభాగానికి, 2 టిడ్కో హౌసింగ్, 1 పింఛన్లకు సంబంధించిన వినతులు వచ్చాయని కమిషనర్ ఏసుబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై దృష్టి సారించాలి

భీమవరం: ప్రైవేట్ సంస్థల బస్ కార్మికుల సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్ డిమాండ్ చేశారు. సోమవారం భీమవరంలో నిర్వహించిన జనతా బస్ డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ సర్వసభ్య సమావేశానికి యూనియన్ గౌరవాధ్యక్షుడు చెల్లబోయిన రంగారావు అధ్యక్షత వహించగా సోమసుందర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడా రు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ప్రైవేట్ విద్యా సంస్థలు, ప్రైవేట్ సంస్థలకు చెందిన వందలాది బస్సుల్లో పెద్ద సంఖ్యలో డ్రైవర్స్, ఇతర కార్మికులు పని చేస్తున్నారని అయితే వారి సంక్షేమాన్ని యాజమాన్యాలు పట్టించుకోవడం లేదన్నారు. వీరికి కార్మిక చట్టాలు అమలు కాకపోవడం విచారకరమని సోమసుందర్ ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి కళింగ లక్ష్మణరావు, ఏఐటీయూసీ నాయకుడు ఎం.లక్ష్మీపతి, జనతా బస్ డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు కాసాని వెంకటేశ్వరరావు, తాడి వీర వెంకట సత్యనారాయణ (పండు), కొప్పినీడి మురళీమోహన్, బత్తిన సుబ్బారావు, సంగీతం మంగన్న, తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ మృతిపై దర్యాప్తు చేయించాలి

ఆకివీడు: మిషనరీ పగడాల ప్రవీణ్ మరణం మిస్టరీ కాకూడదని, న్యాయమైన దర్యాప్తు చేయించాలని ఐక్య క్రైస్తవ (సీబీసీఎన్‌సీ ఈస్టు ఆకివీడు ఫీల్డ్) శాంతి సమావేశం ప్రభుత్వాన్ని కోరింది. స్థానిక సంఘ కార్యాలయంలో సోమవారం సమావేశం సంఘ అధ్యక్షుడు జీడీ లివింగ్‌స్టన్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో పలువురు పాస్టర్లు, సంఘ పెద్దలు, కాపరులు కార్యవర్గ సభ్యులు, సీఆర్‌లు మాట్లాడుతూ ప్రవీణ్ మృతిపై పలు అనుమానాలు వస్తున్నాయన్నారు. దీనిపై దర్యాప్తు చేయడంలోనూ, పోస్టు మార్టం రిపోర్టు ప్రకటించడంలో జాప్యం పట్ల ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పగడాల కుటుంబానికి, క్రైస్తవ సమాజానికి న్యాయం జరిగే విధంగా శాంతి యుత ర్యాలీ నిర్వహించుకునేందుకు అడ్డు పడటం దారుణమన్నారు. మా గొంతు నొక్కినా.. ఘోషను ఆగదని ఆవేదన వ్యక్తం చేశారు. పగడాల కుటుంబానికి, క్రైస్తవ సమాజానికి న్యాయం జరిగే విధంగా ప్రభుత్వం కృషి చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

విచ్చలవిడిగా ఫ్లెక్సీల ఏర్పాటు

- పన్ను వసూలులో అధికారుల నిర్లక్ష్యం
- నిబంధనలకు విరుద్ధంగా వెలుగుతున్న ఫ్లెక్సీలు, హోర్డింగులు
- పంచాయతీల ఆదాయానికి గండి



రోడ్లపై వెలసిన ఫ్లెక్సీలు

ఇరగవరం: కళ్లముందే ఆదాయం కనిపిస్తున్నా... అధికారులు కనికరం చూపుతున్నారు. పంచాయతీల్లో వెలిసే ప్రచార హోర్డింగులు, ఫ్లెక్సీల ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకునే అవకాశం ఉన్న వాటివైపు ఎవరూ కన్నెత్తి చూడటం లేదు. వీటి వసూళ్లలో అధికారుల నిర్లక్ష్యం ఫలితంగా ఎక్కడబడితే అక్కడ నిబంధనలకు విరుద్ధంగా ప్రచార హోర్డింగులు, ఫెక్సీలు, వ్యాపార ప్రకటనల బోర్డులు వెలుస్తున్నాయి. గతంలో పట్టణ ప్రాంతాలకే పరిమితమైన ప్రచార బోర్డులు, హోర్డింగ్‌లు క్రమేపీ గ్రామీణ ప్రాంతాలకు విస్తరిస్తున్నాయి. వ్యాపార సంస్థలు తక్కువ ఖర్చుతో తమ ఉత్పత్తులకు ప్రచారం చేసేందుకు గ్రామీణ రహదారుల వెంబడి ప్రజలను ఆకర్షించేలా బోర్డులను భారీ సైజులో ఏర్పాటు చేస్తున్నారు. వీటి ద్వారా పంచాయతీలు ప్రకటన పన్ను వసూలుకు చర్యలు తీసుకోవాలి. ఇలా వచ్చే ఆదాయంతో అభివృద్ధి పనులు చేపడుతుండాలి. కానీ ఎవరు ఎన్ని హోర్డింగులు, ఫ్లెక్సీలు పెట్టినా పంచాయతీ అధికారులు ఆటువైపు చూడడంలేదు.

ప్రభుత్వ ఆదాయానికి గండి

ఏ ప్రాంతంలో ప్రచార బోర్డులు ఏర్పాటు చేసినా చదరపు మీటరు లెక్కన పన్ను వసూలు చేయాల్సి ఉంది. ఇలా చేయడం వల్ల ఈబోర్డుల ద్వారా ఏటా పంచాయతీలకు వేలాది రూపాయల ఆదాయం వచ్చే అవకాశం ఉంది. అయినప్పటికీ ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టడం లేదు. దీంతో వ్యాపారులు, ఇతర సంస్థలకు చెందిన వారు ఇష్టం వచ్చినట్లు బోర్డులు ఏర్పాటు చేసుకుంటూ పోతున్నారు. దీంతో భారీగా ఆదాయానికి గండిపడుతోంది. ప్రధానంగా మండంలోని పలు ప్రాంతాలతో పాటు ఇతర గ్రామాల్లో అధికంగా ఫెక్సీలు దర్శనమిస్తున్నాయి. ఇంత భారీ మొత్తంలో ఫ్లెక్సీలు, ప్రకటన బోర్డులు ఉన్నా వాటి నుంచి పన్నులు వసూలు చేయడంలో పంచాయతీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా ఫ్లెక్సీలు, హోర్డింగులు

నిబంధనలకు విరుద్ధంగా రోడ్ల వెంబడి ప్రధాన కూడళ్లలోనూ, విద్యుత్ స్తంభాలకు ఫ్లెక్సీలు, హోర్డింగులు, ప్రకటన బోర్డులు అమర్చుతున్నారు. ప్రధానంగా పండుగలు, జాతరలు, రాజకీయ నాయకుల పర్యటన సమయంలో విచ్చలవిడిగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు. వీటిని ఏర్పాటు చేసే ముందు పంచాయతీ, విద్యుత్ శాఖ అధికారుల అనుమతులు తీసుకోవడంతోపాటు ప్రచార బోర్డుల సైజుల ఆధారంగా పంచాయతీలకు పన్ను చెల్లించాల్సి ఉంది. వీటిని ఏర్పాటు చేసే స్థలం కూడా పంచాయతీలో నమోదై ఉండాలి. కానీ ఎక్కడా ఇవి అమలు కావడం లేదు.

అనుమతి తప్పనిసరి

ఫెక్సీలు, ప్రచారబోర్డులు, హోర్డింగులు ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి. అనధికారికంగా ఎవరు బోర్డులు ఏర్పాటు చేసినా తొలగిస్తాం. వినోదపు పన్ను వసూలుకు కార్యదర్శులకు ఆదేశాలిస్తాం.

– కె.శ్రీనివాస్, ఎంపీడీవో, ఇరగవరం

విద్యతోనే అభివృద్ధి సాధ్యం


ఇరగవరంలో ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

ఇరగవరం: విద్యతోనే అభివృద్ధి సాధ్యమని ఇరగవరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కడలి సత్యనారాయణ పేర్కొన్నారు. ఇరగవరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం ఆధ్వర్యంలో సోమవారం ఎన్‌రోల్మెంట్ డ్రైవ్ నిర్వహించారు.ఈ సందర్భంగా హెచ్‌ఎం ఉపాధ్యాయులు, అంగన్‌వాడీలు ఇంటింటికీ వెళ్లి విద్యార్థులను తమ పాఠశాలలో చేర్చాలని ప్రచారం చేశారు. ప్రభుత్వ పాఠశాలలో ఉన్నత విద్యతోపాటు విద్యార్థుల సౌకర్యార్థం తరగతి గదికి 5 ఫ్యాన్‌లు, తాగేందుకు ఆర్‌ఓ వాటర్ వంటి అనేక సదుపాయాలు ఉన్నాయన్నారు. అలాగే ఉన్నత విద్యావంతులైన ఉపాధ్యాయులు విద్యార్థుల చదు వుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారని తెలిపారు. సంపూర్ణ పోషక ఆహారాన్ని మధ్యాహ్న భోజనం ద్వారా అందజేస్తున్నట్లు తెలిపారు. దాతల సహకారంతో ఏర్పాటు చేసిన డైనింగ్ హాల్‌లో విద్యార్థులు భోజనాలు చేస్తున్నారని అన్నారు. దీంతోపాటు పాఠశాలకు దాతల సహకారం ఎంతో ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పీ రేణుకా, కె.రామకృష్ణ, జే సుబ్బారావు, ఎస్ రామకృష్ణ, భవిత ప్రత్యేక ఉపాధ్యాయుడు ఎంటీ గాలేశ్వరరావు, వై జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

మానవత సేవలు అభినందనీయం


తణుకులో చిరు వ్యాపారులకు గొడుగులు అందజేస్తున్న మానవత సేవా సంస్థ ప్రతినిధులు

తణుకు అర్బన్: మానవత సేవా సంస్థ ద్వారా పట్టణానికి చెందిన చిట్టూరి సుజాత అందజేస్తున్న సామాజిక సేవ అభినందనీయమని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. సోమవారం తణుకులో మానవత సంస్థ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సుజాత తన భర్త చిట్టూరి అచ్యుత రాంప్రసాద్ జయంతి సందర్భంగా మానవత ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాలకు సంబంధించి రూ. 50వేలకుపైగా అందజేసినట్లు మానవత ప్రతినిధులు తెలిపారు. వేసవి సందర్భంగా ఏర్పాటు చేసిన చలివేంద్రానికి రూ.10వేలు, రహదారులపై వ్యాపారాలు చేసుకునే చిరు వ్యాపారులకు రూ.25వేలతో 25 గొడుగులు, డిగ్రీ విద్యార్థిని ఆవుల సంధ్యకు రూ.10వేలు, తణుకుకు చెందిన ముళ్లపూడి విజయలక్ష్మికి జెరాక్స్ మిషన్ మరమ్మతుల నిమిత్తం రూ. 5వేలు, జిల్లా కేంద్ర ఆస్పత్రిలో 200 మంది రోగులకు బ్రెడ్, అరటిపండ్లు అందజేశారు. మానవత సభ్యులు నందిగం సుధాకర్ విద్యార్థిని సంధ్యకు రూ. 6వేలు ఆర్థికసాయం అందజేశారు. మానవత సేవా సంస్థ అధ్యక్షురాలు కటారి శారదాదేవి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో జిల్లా శాంతి ర్యాలీ కమిటీ చైర్మన్ గమిని రాంబాబు, రాష్ట్ర విస్తరణ, అభివృద్ధి కమిటీ చైర్‌పర్సన్ డాక్టర్ కోడూరి రాధాపుష్పవతి, ప్రతిభా పురస్కారాల కమిటీ చైర్‌పర్సన్ బోయపాటి రామలక్ష్మి, రామకృష్ణ, కార్యదర్శి బొల్లం రామకాశి, ఉపాధ్యక్షుడు కడించర్ల రాజరాజేశ్వరరావు, తణుకు మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ కటారి కాశీ విశ్వనాథ్ రాజు, లయన్స్ కమిటీ సభ్యులు దామెర్ల రాంగారావు పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల రథోత్సవం


రథం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

పెంటపాడు: మండలంలోని కె. పెంటపాడు బైరాగి మఠంలోని గోపాలస్వామి ఆలయంలో శ్రీరామనవమి ఉత్సవాలు పురస్కరించుకొని రెండో రోజైన సోమవారం సాయంత్రం రథోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈవో బీవీ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో అర్చకులు త్రిలోచన దాసు, పూర్ణచంద్రత్రిపాఠిలు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం తులసీదళ పూజలు, సహస్రనామార్చనలు, నిత్య హోమాలు నిర్వహించారు. సాయంత్రం 4 గంటలకు కుంభ హారతి, ప్రత్యేకంగా పూలతో అలకరించిన భారీ రథంపై స్వామివార్ల గ్రామోత్సవంలో రాములోరిని ఊరేగించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల నుంచి భక్తులు, మహిళలు రథం లాగేందుకు పోటీ పడ్డారు. ఈ సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా కేశవరానికి చెందిన బ్యాండ్ పార్టీ, కేరళ సింగారి మేళం, తేతలి వారిచే లలిత కోటేశ్వరి సన్నాయిమేళం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

కోరిమిల్లిలో ప్రారంభమైన సువార్త పండుగలు

పెంటపాడు: దేవుని ప్రేమకు విధేయులై, ఆయన చిత్తాను సారంగా క్రైస్తవులు జీవనం సాగించాలని రాజమండ్రికి చెందిన దైవసేవకులు షేక్ మక్బూల్ పేర్కొన్నారు. దైవసేవకులు మల్లిపూడి ఒనేసిం, అరుణ ఒనేసిమ్ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు కోరిమిల్లిలో ఏసుక్రీస్తు ప్రార్థనా మందిరంలో ఏసయ్య సువార్త పండుగలు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా షేక్ మక్బూల్ మాట్లాడుతూ నిన్నువలే పొరుగు వానిని ప్రేమించాలనే ఆజ్ఞకు ప్రతిఒక్కరూ విధేయులు కావాలనఅనరు. ఈ కార్యక్రమంలో జి. డేనియల్ జిత్రో(వైజాగ్), (రాజమండ్రి), జి. విజయ్య (బిట్రగుంట) ఈ సభలకు హాజరువుతారని నిర్వాహకులు ఒనేసిం తెలిపారు.

పేదలకు న్యాయం అందుబాటులో ఉండాలి

ఆకివీడు: పేదలకు న్యాయం అందుబాటులో ఉండాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎల్ నర్సింహరాజు పిలుపునిచ్చారు. స్థానిక బైపాస్ రోడ్డులో వైఎస్సార్‌సీపీ ఉండి నియోజకవర్గ లీగల్ సెల్ కన్వీనర్, అడ్వకేట్ రుంకాన శ్రీహరి కార్యాలయాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ పేదలకు, కార్యకర్తలకు అండగా ఉండాలన్నారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో లాయర్లకు రూ.5 వేల గౌరవ భృతి కల్పించారని పీవీఎల్ చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వం లాయర్లకు ఏ విధమైన సౌకర్యాలూ కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ధర్మానికి కట్టుబడి పని చేయడం ద్వారా మంచి ఫలితాలు పొందొచ్చన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు నంద్యాల సీతారామయ్య, పట్టణ అధ్యక్షుడు అంబటి రమేష్, మంతెన సునిల్ కుమార్‌వర్మ, కేశిరెడ్డి మురళీ, దిలీప్, మెప్మా మాజీ అధ్యక్షురాలు మోరా జ్యోతిరెడ్డి, అందే రాజబాబు, కుంకట్ల దానయ్య, సత్యనారాయణ, హుస్సేన్, మెంటే లక్ష్మణరావు, పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

పెనుగొండ: కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఎం మండల కార్యదర్శి షేక్ పాదుషా డిమాండ్ చేశారు. సోమవారం పెనుగొండ తహసీల్దారు కార్యాలయం వద్ద ప్రజాసమస్యల పరిష్కార వేదిక సమయంలో ధర్నా చేశారు. తహసీల్దారు జి.అనితకుమారి, ఎంపీడీఓ టి.సూర్యనారాయణ మూర్తిలకు వినతి పత్రం అందజేశారు. కాలనీల్లో తాగునీరు, రోడ్లు, విద్యుత్ లైన్లు, వీధి లైట్లు ఏర్పాటు చేయాలని కోరారు. రోడ్లు లేక గ్యాస్ సిలిండర్లు, రేషన్ వాహనాలు సైతం కాలనీలకు రావడం లేదని వాపోయారు. మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు.

ఉపాధి కూలీలకు బకాయిలు చెల్లించాలి


అర్జునుడి పాలెంలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా నాయకులు

ఇరగవరం: ఉపాధి హామీ కూలీలకు జీతాలు చెల్లించకపోవడంతో వారంతా పస్తులు ఉంటున్నారని రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జెక్కంశెట్టి సత్యనారాయణ, సహాయ కార్యదర్శి బళ్ళ చినవీరభద్రరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఇరగవరం మండలం అర్జునుడుపాలెంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలను పరామర్శించి వారితో మాట్లాడారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశాభివృద్ధిలో ప్రధానపాత్ర పోషిస్తున్న ఉపాధిహామీ పట్ల కేంద్రంలో మోదీ ప్రభుత్వం తీరు మార్చుకోవాలన్నారు. త్యాగాలు, పోరాటాల ద్వారా సంపాదించుకున్న ఉపాధిహామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తే చూస్తూ ఊరనుకోమని అన్నారు. ఉపాధి హామీ చట్టంపై వివిధ ఆంక్షలు పెట్టి నిరుపేదలైన కూలీలపై ప్రత్యక్ష దాడికి దిగడం మంచిపద్ధతి కాదని హితవు పలికారు. వ్యవసాయ కోతలు, నాట్లు వేయడం తప్ప మిగిలిన సమయాల్లో ఖాళీగా ఉండే ప్రజానికానికి ఉపాధిహామీ మాత్రమే ఆధారం కనుక కేంద్రం కల్పించుకుని ఉపాధిహామీకి అధిక నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిల్లి అంజలీ, గంటా శ్రీనివాస్, కర్రి గంగాలక్ష్మీ, పొట్ల బాలయ్యసుందర ఆదినారాయణ, పాలకోడేటి పద్మ, తామరపల్లి వెంకటేశ్వరరావు, మారంపూడి సంతోషం, నేపుగంటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమతుల ఆహారంతో సంపూర్ణ జీవితం



అత్తిలి: పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది


తాడేపల్లిగూడెం రూరల్: మాధవరం గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

అత్తిలి: ప్రతీ వ్యక్తి సమతుల ఆహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా జీవించవచ్చని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ ఆర్ సురేఖ అన్నారు. సోమవారం అత్తిలి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ ప్రతీ వ్యక్తి ఆరోగ్యంగా ఉండటం ప్రారంభించినపుడు భవిష్యత్ ఆశాజనకంగా ఉంటుంది అనేది ఈసంవత్సరం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం యొక్క ముఖ్య ఉద్దేశ్యమన్నారు. గర్భధారణ సమయంలో బాధ్యత, సంరక్షణ, శిశువుల రక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సిబ్బందికి సూచించారు. మాతృమరణాలు, శిశుమరణాలు తగ్గించడానికి అందరూ కృషి చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ పి మురళి, హెచ్‌ఈ జి ప్రమీలారాణి, ఎంపీహెచ్‌ఏ జెఎస్ గనిరాజు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గర్భిణులు ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలి

తాడేపల్లిగూడెం రూరల్: గర్భిణులు ఆకుకూరలు, పాలు వంటి ఆరోగ్యకరమైన ఆహారాలు తీసుకోవాలని మాధవరం పీహెచ్‌సీ వైద్యాధికారి వీరవెంకటేష్ అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సోమవారం మండలంలోని మాధవరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వీరవెంకటేష్ మాట్లాడుతూ గర్భస్థ దశ నుంచే శిశువు ఆరోగ్యంపై తల్లు లు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం ఆరోగ్యకరమైన ఆరంభం... ఆశానక భవిష్యత్‌అనే నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి టి.సింధు, ఎంపీహెచ్‌ఈవో జి.వెంకటేశ్వరరావు, హెల్త్ సూపర్‌వైజర్ సీహెచ్‌వీ.మణి, ఎస్. అశోక్‌బాబు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


తాడేపల్లిగూడెం రూరల్: వెంకట్రామన్నగూడెంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


తణుకు అర్బన్: హెల్త్ సెంటర్‌లో మాట్లాడుతున్న వైద్యులు

వీఆర్.గూడెంలో ర్యాలీ

ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సోమవారం మండలంలోని వెంకట్రామన్న గూడెం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ రూపాదేవి మాట్లాడుతూ గర్భిణులు సమయం ప్రకారం వ్యాక్సిన్, ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రలు వేసుకోవాలన్నారు. గర్భిణులు, బాలింత సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అదే రీతిగా శిశువులకు వైద్యునిచే పరీక్షలు చేయించి క్రమం తప్పకుండా వ్యాక్సిన్లు వేయించాలన్నారు. సీహెచ్‌వో సూర్యకాంతం, పీహెచ్ఎన్ అన్నమ్మ, హెచ్ఎస్ లక్ష్మణరావు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రపంచ ఆరోగ్య దినోత్సవం


తణుకు అర్బన్: ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా తణుకు కోర్టు నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి ఆదేశాల మేరకు తణుకు బార్ అసోసియేషన్ న్యాయవాదులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులచే డాక్టర్లచే ఆశ, ఏఎన్ఎంలకు అవగాహన సదస్సు నిర్వహించారు. సీనియర్ న్యాయవాదులు కామన మునిస్వామి, కౌరు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో శారీరక, మానసిక అనారోగ్యాలతో మానవాళి కుంగుతున్నారని స్పష్టం చేశారు. ముఖ్యంగా మానసిక వత్తిడి తీవ్ర ప్రభావం చూపుతూ అనారోగ్యాలకు దారితీస్తుందని అన్నారు. మేజర్లు కాకుండా వివాహాలు చేసుకుంటే ఆరోగ్య వారిలో ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. కోర్టులు పనిచేయు ప్రతి చోటా మండల న్యాయ సేవల కమిటీ ద్వారా ఉచిత న్యాయ సహాయం, సేవలు అందిస్తారని, ప్రో నోటు లేదా చెక్కు ఖాళీగా ఇవ్వ కూడదని తెలిపారు. ఆరోగ్య కేంద్రాల వైద్యులు ఆరోగ్య విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. డాక్టర్లు శ్రీ రాజా నాగభూషణం, ఎస్.దానియేలు రాజు, పృధ్విరాజ్, సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు, హెల్త్ సూపర్‌వైజర్ పి.సునీత పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం

తాడేపల్లిగూడెం: ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సోమవారం ఉదయం శశి ఇంజనీరింగ్ కళాశాల, యూనియన్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో హృదయ సంబంధిత వ్యాధులపై అవగాహన కార్యక్రమంలో భాగంగా నడకను ఘనంగా నిర్వహించారు. పట్టణంలో శశి కళాశాల ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ యూనిట్లు, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో నడకలో విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. ఆకాశం ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ హేమ మాలిని, కళాశాల డీన్ డాక్టర్ టి.సుబ్రహ్మణ్యం, ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ షేక్ రఫీలు పాల్గొన్నారు.

ఆరోగ్య నియమాలు పాటించాలి

పెంటపాడు: తల్లీబిడ్డల ఆరోగ్యంపై ప్రతీ ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ వహించాలని ముదునూరు పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ పూజిత పేర్కొన్నారు. సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకొని స్థానిక పీహెచ్‌సీలో ర్యాలీ నిర్వహించారు. సిబ్బందికి అవగాహన సమావేశం నిర్వహించారు. సిబ్బంది పాల్గొన్నారు.


తాడేపల్లిగూడెం: ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు


పెంటపాడు: ముదునూరు పీహెచ్‌సీ కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్ పూజిత

రాజీయే రాజ మార్గం

భీమవరం: జాతీయ లోక్‌అదాలత్‌లో రాజీయే రాజ మర్గామని మూడో అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవా సంస్థ చైర్మన్ ఎంఏ సోమశేఖర్ అన్నారు. కక్షిదారులు కోర్టుల చుట్టూ తిరగకుండా రాజీ చేసుకుంటే సమయం, నగదు ఆదా అవుతుందన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా భీమవరం మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో మే 10న కోర్టుల ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జడ్జి సోమశేఖర్ చెప్పా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీ మార్గమే రాజమార్గమన్నారు. జాతీయ లోక్‌అదాలత్‌లో సివిల్ కేసులు, రాజీ కాదగిన క్రిమినల్ కేసులు, చెక్కు బౌన్స్ కేసులు, మనోవర్తి, మోటార్ యాక్సిడెంట్ బీమా, గృహహింస, బ్యాంకు, బీఎస్ఎన్ఎల్ మొండి బాకీ కేసులు వంటివి రాజీ చేసుకోవచ్చన్నారు. లోక్ అదాలత్ రాజీ అంతిమ తీర్పు కావడంతో అప్పీలు చేసుకునే అవకాశం ఉండదన్నా రు. సివిల్ కేసుల్లో రాజీ చేసుకుంటే ముందుగానే కట్టిన కోర్టు ఫీజు వాపసు వ స్తుందని కక్షిదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జడ్జి సోమశేఖర్ తెలిపారు. న్యాయవాదులు, పోలీసు అధికారులు రాజీ ప్రాముఖ్యతను కక్షిదారులకు వివరించి ఎక్కువ కేసుల రాజీకి ప్రయత్నం చేయాలని సూచించారు.

పంట నష్ట పరిహారం చెల్లించాలి

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో గత సార్వా పంట నష్టం వెంటనే రైతులకు చెల్లించాలని ఏపీ కౌలు రైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు కోరారు. కౌలు రైతుల సంఘం తరపున కలెక్టర్ నాగరాణికి సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోఅధిక వర్షాలకు జిల్లాలో 17 మండలాల్లో 135 గ్రామాల్లో 10,900 ఎకరాలు పైబడి పంటలు ముంపునకు గురై దెబ్బతిన్నాయన్నారు. ఈ దశలో వ్యవసాయ అధికారులు జిల్లాలో 8729 మందికి 9.54 కోట్ల పంట నష్టం అంచనాలు వేసి ప్రభుత్వానికి పంపారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం 2019 కౌలు చట్టాన్ని రద్దు చేసి, ఆంధ్రప్రదేశ్ సాగుదారుల హక్కుల చట్టం 2024 తీసుకొచ్చిందన్నారు. ఈ చట్టం విధి విధానాలు తయారు చేసి రాష్ట్రంలోని ప్రాంతీయ సదస్సులు పెట్టి ప్రజాభిప్రాయ సేకరణ పూర్తి చేసిందని కానీ ఇంత వరకు అధికారికంగా పాత చట్టాన్ని రద్దు చేయలేదని కొత్త చట్టం ఆమోదించలేదన్నారు.